# 10

## కాటుకరేఖా - కళ్ళజోడూ

[ఖచ్చితంగా చెప్పాలంటే ఇదొక కథకాదు; కాని మరో పేరు లేనందున 'కథ' అనే పిలువబడుతుంది. ఇట్లాంటి దానికి పెద్ద ప్రేరేపణ ఏమీ వుండదు. మనసున పిల్ల తెమ్మెరలు వీచిన క్షణాన, లోకమే నవ్వుల వెన్నెల అనిపించిన నిముషాన ఉల్లాసం మరొక రూపం తొడుక్కున్న కథ ఇది.

ప్రతీ కథకూ ఆధారం ఒకటి వుండాలికదా, దీనికేమిటి మూలం అని నిలదీసి మీరు అడగనూ రాదు; నేను చెప్పనూ లేను।]

నవల మంచి రసవత్తరమయిన ఘట్టంలో వుంది. నిముషానికో పేజీ తిరిగి పోతూంది. ఇహాన్ని మరచి అందులో లీనమయి వున్నాడు శేషగిరి.

ఉన్నట్లుండి—

నవల పేజీలకూ, పాఠకుడి నయనాలకూ మధ్య అందమయిన తమలపాకు తీగలు అయిదు మొలిచాయి. కళ్ళు చిట్లించాడు శేషగిరి; దృష్టి మళ్ళించలేదు.

గభుక్కున—

నోరుతెరచి గ్రద్దలా ముందుకువాలాడు, ఆ తీగలను నమి లేద్దామని.

తీగెలు ఎగిరిపోయాయి. నాలుకకు నవల తగిలింది. రుచి అంత రసవత్తరంగా లేదు.

సరోజ నవ్వింది. అయినా శేషగిరి తన తపస్సులోనుండి లేచిరాలేదు.

ప్రక్కనే వున్న టేబిల్ మీది ఫ్లవర్ వాజ్‌ని సర్దసాగింది సరోజ. 'వేళ్ళను కొరకడం ఆటవికుల లక్షణం!' అని లాక్షణిక శాస్త్రం చదవసాగింది.

శేషగిరి పలకలేదు.

"ఇలాటి షోంబేలుంటే దేశం ఎలా బాగుపడుతుంది?" అని పృచ్ఛచేసింది. ఓరకంటితో చూసింది.

నవలమీద నుండి కళ్ళుతీయకుండానే పలికాడు పాఠకుడు— "హుం!.........మూర్ఖులు!"

"ఏవిటీ-ఏవన్నారూ-?" అని రంయ్‌మని వచ్చి శేషగిరి చేతి లోని నవలను నాలుగ్గజాల దూరానికి విసిరేసి ఎదుట నిల్చుంది సరోజ.

"హేమీ లేదు. ఆ నవలను తెచ్చిపెట్టుము—"

"ఉహు!"

"ఏం?"

"పండగరోజు పొద్దునేలేచి, నావేళ్ళను కొరికి, నన్ను దూషించి పుస్తకాన్ని తెచ్చి ఇమ్మంటే ఎందుకు తెస్తాను?" అంది సరోజ ఏడుగురు రాజుకొడుకుల కథలో చీమలాగ.

"ఒహ్హో! ఇవాళ సంకురేత్రికదనే సిలక ఎంకీ! ఆమాటే మరచినోడు నీ చిన్నోడు—" నయగారాల బేరాలు సాగించాడు నవలను మరచిన నాయకుడు.

ఎంకి ఎల్లింది వంటింట్లోకి; ఎంట బడ్డాడు శేషగిరి.

"వాట్ మిసెస్ గిరీజీ! కుంపటిపక్కనయితే స్థానబలిమి ఎక్కువని కాబోలు—"

"మిసెసూ, బిసెసూ అనకగాని ఈపూట తలంటి స్నానం చేస్తారా? చేయరా? ముందామాట చెప్పండి."

"ఏమిటి ఈప్లేటు మార్పిడి?"

"ఊఁ! చెప్పండి—"

"ఏమిటి? ఆరో ఎక్కమా?"

"పోనీ అదేచెప్పండి! ఆరు అరవై రెండ్లు ఎంత?"

"మూడువందలా అరవై ప్రాంతం—"

"భేష్-అయితే ఇహనేం! ఏలినవారికి నూనె నేనే అంట వలసిందే—"

"బాబోయ్-తలను శత్రువు చేతిలోకి ఇచ్చేసి కూచుంటే మానెసాకుతో మాడు వాచిపోదూ?"

"ఛీ! పండగపూట-అలా అపశకునాలు పలక్కండి!"

"ఏం, ఎందుకు పలక్కూడదూ? ఇంకా ఇంతకన్నా పొద్దున్నే బాగా బాల్యంలో వుండగానే నన్ను షోంబే అని, సాలజార్ అనీ వర్ణించలేదూ నువ్వు?" అని అపోజిషన్ నాయకుడిలా లేచాడు శేషగిరి.

"ఓస్! నే నేమన్నా అన్నానా చేశానా? అథవా అన్నా, నవలలో పడి కూచున్న మీకు వినబడి ఏడిచిందా?"

"హోల్డాన్!" అని కాస్త గట్టిగా అరిచేసి 'ఎఫెక్టు' నిమిత్తం ఒక స్టెయిన్‌లెస్‌స్టీల్ గరిటెను కింద పడేశాడు. సరోజ అదిరిపడి గరిటెను చూసింది. తర్వాత గరిటెను పడేసిన ఆయన్నూ చూసింది.

"సరోజా! ఇది స్పష్టంగా తెలుసుకో"

"ఏది-" అని అడగలేదు సరోజ.

"—నువ్వు నీ ఇంతకు ముందు డైలాగులో ఆఖరి వాక్యం చదువుకో-వినబడి ఏడిచిందా-అన్నావు. ఈ వాక్యంలోని ఉత్తర పదం, అనగా ఏడిచింది అన్న అక్షరచతుష్టయం చాలా పెద్ద తప్పు—"

"అలాగాండి?" అంటూ కిందపడివున్న గరిటతో ఆడుకో సాగింది సరోజ.

"సదరు 'ఏడిచిందా' అన్నపదం ఏడిశారు అన్న ధాతువులో నుండి వచ్చింది. సదరు ధాతువుని భారత సంస్కృతి తెలిసిన ఏ సతీమణికూడా తన పతిదైవం మీద వాడకూడదట!"

"అని ఎవరన్నారు?"

"చాలా బోల్డుమంది అన్నారు. ఉత్తరాలుకూడా రాశారు. నువ్వా పదం వాడావని చదవగానే వాళ్ళందరికీ చలిజ్వరాలు వచ్చాయట."

"హవ్వ! ఆపళంగా 'క్వినైన్' మాత్రల ధరలు గగారిన్‌లా ఎగిరిపోయి వుంటాయి కదండీ" అని అడిగింది అమాయకత్వం.

"కనక-ఇంకెప్పుడూ నువ్వా పదాన్ని భర్తలమీద వాడకూడదు-"

"ఛీఛీ-భర్తలేమిటి భర్తలు?"

ఉలిక్కిపడ్డాడు శేషగిరి; బహువచనంలోని ముద్రారాక్షసం గ్రహించాడు.

"అదేలే! భార్యలు భర్తల్ని అలా అనరాదు."

"ఎవరి భార్యలు?"

"ఆయా భర్తల భార్యలు."

"ఏయే భర్తల భార్యలు?"

"ఇందాకా బహువచనంలో రిఫర్ చేయబడిన భర్తల భార్యల యొక్క భర్తల తాలూకు భార్యలు-" అన్నాడు శేషగిరి. వాక్యం పూర్తిచేసి దవడలు ఒత్తుకున్నాడు.

"ఆ భార్యలూ భర్తలు అనుకోకపోతే పోనివ్వండి గాని మనిద్దరికెందుకూ?"

"నిజమే. ఎందుకూ?" అని ప్రతిధ్వనించాడు పతిశేఖరుడు.

"ఏమండీ ఇంకొక్కమాట-"

"సావధానుడ!"

"సంసారం అంటే రెండుచక్రాల బండి వంటిది కదండీ!"

"అఫ్‌కోర్స్—మొదట రెండు చక్రాలబండే అనుకో - ఆ తర్వాత భానుమతి పుడితే ఓ చక్రమూ, చక్రపాణి పుడితే మరో చక్రమూ ఇలా పిల్లచక్రాలు పెరిగిపోతాయి...."

"అబ్బబ్బబ్బ!....భార్య, భర్త అన్న ప్రధాన చక్రాలు రెండే కదండీ!"

"హాఁ జీ!"

"భార్య భర్త అన్న ఈ రెండు చక్రాలూ సమానమే కదండీ!"

"కాదనగల దే సత్యాపతీ?"

"మీరు బోలెడు అబద్ధమైన కోపంతో, కొండంత మనిషిలా ఎదుట నిలిచిన నన్ను 'ఏడిశావు' అంటే నా కెంత ఇదిగా వుంటుం దనీ!" అంది సరోజ.

శేషగిరికి నెత్తిమీద అపరంజీ, పారిజాతాలూ, హిమాలయాలూ బోర్లించినట్లయింది. "నిజంగానా సరోజా-" అనగలిగింది అతడి స్వరం.

"అవునండీ మరి.........మీరు మాత్రం నన్ను 'ఏడిశావు' అనడం మానకండేం!"

"మానను మానినీ, మానను!--ఏదిమానిన మానెదగాక నిది మాన! నిదిమాన! నిదిమాన!"

నవ్వుల గవ్వలు చల్లుకుంటూ వెళ్ళింది సరోజ....వాటన్నిటిని ఏరుకుని ఎదలో పదిలం చేసుకుని ముందు గదిలోకి వచ్చి నవలను తీసుకున్నాడు గృహమేధి.

"అయ్యో, తమరి స్నాన విషయం?"

"వచ్చె వచ్చె!"

పది నిమిషాల తర్వాత శేషగిరి పీటమీద కూర్చోగా కాచిన నూనెగిన్నె తెచ్చి పక్కన పెట్టింది. చెంచాతో నూనె తీసుకుని తలకు రాచుకో బోయాడు శేషగిరి.

"ఆగండి! ఆగండి!" సరోజ భర్త నుదుట కుంకుమబొట్టు పెట్టింది....మూడు చెంచాల నూనె చేతిలోకి తీసుకుంది.

అరగంట తర్వాత-అభ్యంజన స్నానానంతరం - గోచిపోసి ధోవతి కట్టి బనియను తొడిగి పెద్ద ఉత్తరీయాన్ని విప్పి కప్పు కున్నాడు శేషగిరి. తిలకం ధరించాడు.

అతడిని చూసిన సరోజ నయనాలు తేట నీటిలో చిరు చేపల్లా మెరిశాయి. "ఏమండీ! మీకేం....మరేం-కాటుక పెట్టనాండి?...." అని గారాబంగా కోరింది.

"వాట్?"

"పోన్లెండి బాబూ! ఏదో అందంగా వున్నారు కదా, ఇం కాస్త అందంగా చేసి చూద్దామని సరదాపడి అడిగాను కానీ-"

"పోనీ, పెట్టు చూద్దాం! కాని రెండుషరతులు-కళ్ళని వేళ్ళతో పొడిచేయకూడదు; ఏదో పర్మిషన్ ఇచ్చాను కదా అని అదేపనిగా నా మొహంమీద కాటుక ముగ్గులు పెట్టేయకూడదు--" అని తన అంగీకారాన్ని తెలియ బరిచాడు భర్త.

"ఏమండీ-మరే....మావారు అనే అబ్బాయేం ఎంతో మంచి వారు--" అని లేడిలా గెంతి వెళ్ళింది సరోజ. నిముషంలో కాటుక భరిణతో వచ్చింది.

శేషగిరిని కుర్చీలో కూర్చోమంది. అలంకరణ మొదలయింది.

"....ఇదిగో....అలా కదలవద్దన్నానా....ఊఁ....కళ్ళ రెప్పలు అలాఆడిస్తే ఎలా?....ఆ....ఈ కన్ను....కాస్త అటు తిరగండి.... మొహం పైకెత్తండి....ఆ....అదీ...."

కాటుక పెట్టడం అయింతర్వాత గభుక్కున బుగ్గమీద చుక్క పెట్టింది సరోజ. నాలుగడుగులు వెనక్కు వెళ్ళి శేషగిరిని చూసింది...." అచ్చం పెళ్ళికొడుకులా ఉన్నారు సుమండీ" అంది. ఒక్క ఉదుటున ముందుకొచ్చింది....

ఆపూట ఆవీట గలగలమని ఆనందం అలలలలై నిండింది. "ఓయ్, కాస్త అద్దం తెచ్చిపెట్టు—అసలు మన మొహం ఎలా

వెలుగుతూందో చూద్దాం-'' అద్దం వచ్చింది. పెళ్ళి కళమాట దేవు డెరుగుకాని హైద్రాబాదు వీధుల్లో కనపడే కొందరిలా వున్నాననిపించింది శేషగిరికి. ఆ అభిప్రాయాన్ని వెలిబరుద్దామని అనుకునే లోపుగా సరోజ అడిగింది— "ఏమండీ! ఈవేళ ఎక్కడికీ వెళ్ళరు కదూ?''

"ఏం?"

''ఏమేవిటీ-రోజూ ఆఫీసు, ఆఫీసు అని వెళ్ళిపోతారు, అప్పుడేమో నేను ఒంటరిగా వుండాలికదా-ఈ రోజయినా మీరు ఇంట్లో వుండకూడదేం—''

''అమ్మాయీ! నీ కోర్కెను మన్నించాం పో!''

''అయ్యో మొహమా! అచ్చం ఆఫీసరులా వుందే!" అన్న సరోజ వాక్యం మధ్య 'కామా' ల్లాగ, వీధి తలుపుమీద గుద్దులు పడ్డాయి. గడియారం తొమ్మిది కొట్టడం ఎవ్వరికీ వినిపించలేదు.

వీధిలోనుండి గాత్రం-'ఒరేయి శేషగిరీ!' అన్న పంక్తినే పల్లవిగా అనుపల్లవిగా చరణంగా పాడేస్తున్నట్లు తెలిసింది.

'వస్తున్నాన్రోయ్........తలుపుల్ని తీసెయ్యకోయ్........' అంటూ పరుగెత్తబోయిన శేషగిరి ఉత్తరీయం పట్టి లాగింది సరోజ.

''పాటుక తుడుచుకు వెళ్ళరూ—''

''లాభంలేదు. ఈలోపుగా తలుపులు పగిలిపోయేట్టున్నాయి-''

''--మీ రా డ్రాయర్లోని చలవ కళ్ళజోడు పెట్టుకోండి — నేవెళ్ళి తలుపుతీస్తా"-అని గుమ్మంవైపు నడిచింది సరోజ.

''శేషగిరి తలుపు తీస్తాడుకదా, 'ఏరా వెధవాయ్ ఇంత సేపట్రా తలుపు తీయడానికి' అందాంకదా,"అంటూనే అతి వాత్సల్యంతో అతగాడి వీపుమీద ఒక్కటి వడ్డిద్దాంకదా, అని తన దక్షిణహస్తాన్ని సిద్ధంగా పైకెత్తి నిలుచున్న కోనేటిరావ్ అష్టదిక్ భ్రమలుపడి, కోటి వంకరలు తిరిగి పోయాడు సరోజను చూసి.

ఆమె తలుపుతీసి ఇంట్లోకి నడిచింది. నెత్తిమీదుగా అరబ్ వీరుడిలా మఫ్లర్ని క్రిందికి జార్చి కడుతున్నాడు శేషగిరి.

కోనేటిరావింకా వీధిలోనే, భ్రమలోనే వున్నాడు.

"ఎవడు వాడు—?" అన్నాడు శేషగిరి ఆకుపచ్చ కళ్ళజోడు గుండా చూస్తూ.

"ఎవరో మరి-అమెరికాలో లిబర్టీ విగ్రహంలా కుడిచేతిని పైకెత్తి నిలుచున్నాడు-"

"ఎన్నికల ఋతువు కదూ-ఎవడయినా నాయకుడేమో—"

"ఈ అవతార మేవిటి?" అంది సరోజ.

"ఈ మఫ్లరేనా?-బుగ్గమీద చుక్క—!! వీపుమీద తాపు-ముందు పండ్లూడిన కథ? వాట్!!" అని సరోజ జాలిపడేట్లు నవ్వబోయిన శేషగిరి ఠక్కున తిరిగాడు. "ఓరి నీ! నువ్వట్రా కోనేరూ! వెన్ కేము!"

"హి-హి-హి.... కేమ్ మార్నింగ్.... వితౌట్ వార్నింగ్. హిహిహి" అని పొయెట్రీ చదివేసి నవ్వేశాడు కోనేటిరావు.

"ఒరేయ్.... కూర్చో కూర్చో .. ముందాచేతిని కిందకు దింపేయి.... తర్వాత చెప్పు-మీ బాబాయిని చంపేశావా లేదా? చంపినట్లయిన ఎవ్విధంబున? చంపనట్లయిన ఎందువలన?"

"ప్చ!... ఆయనే పోయాడురా..."

"బాప్‌రే! అయితే ఆ అరవై వేలూ నీ కొచ్చేసిందన్న మాట—"

"ప్చ!"

"అదేవిటి?"

"ఆయన ఆస్తి అంతా స్వార్జితమట-అంతా తిరుపతి బాలాజీకి రాసేసి వెళ్ళిపోయాడు—"

"హుం!" అన్నాడు శేషగిరి. అందులోనూ మొహం చుట్టూ బిగించి కట్టిన ఉన్నిమఫ్లర్ బాగా గుచ్చుకుంటుండడం మూలాన్ని, ఆ 'హుం' అన్న శబ్దం ఎంతో బ్రహ్మాండమయిన ఎఫెక్టుతో-అచ్చం తెనుగు సినిమాలంత ఏడుపుతో వచ్చింది.

"హుం!'' అని కోనేటిరావు కూడా అన్నాడు. అని ఆ తర్వాత ఇలా అన్నాడు:

"ఒరేయ్ శేషగిరీ! చిన్నప్పుడు మన తెలుగు మేష్టారు చెప్పినట్లు గతజలసేతు బంధనంవల్ల లాభంబేమి? కనుక అది మరిచిపోదాం—'' అన్నాడు.

తల ఆడించాడు శేషగిరి.

"అది సరేగాని, శేషగిరీ! ఇంత బ్రైటు మూనులైటుపూట ఏటికి కళ్ళ కాలద్దాల కోటలు?''

"ప్చ'' అన్నాడు శేషగిరి. కేవలం మఫ్లర్ గుచ్చుకోవడమే కాకుండా దవడలు ఉడికిపోవుట మొదలయింది.

"ఏవిటి, కన్ను ఆపరేషన్ చేయించుకున్నావా?" అన్నాడు కోనేటిరావ్, లేచి దగ్గరకొచ్చి శేషగిరి మొహంలోకి మొహం పెడుతూ.

తన మొహాన్ని వెనక్కి లాక్కొని ప్రక్కకు తిప్పుకున్నాడు శేషగిరి.

"ఏ కన్ను?''

"రెండూను'' అన్నాడు శేషగిరి.

"ఏం-ఏంజరిగిందీ-'' అన్నాడు కోనేటిరావ్ అరవసినిమా అంత ఏడుపుతో.

శేషగిరి కుర్చీలో చేరగిలబడి కూర్చున్నాడు. దీర్ఘంగా ఆలోచించాడు. బరువయిన స్వరంతో నెమ్మదిగా మొదలుపెట్టాడు. "మొన్న మనవాళ్లు వరాసగా మొదటి మూడు క్రికెటు టెస్టుల్లోనూ దెబ్బతిన్నంత పనయిందా-ఆపళంగా నాలుగో టెస్టుకి నన్ను టెలిగ్రాఫుమీద కేకేశారు-"

"అబ్బా!'' అన్నాడు కోనేరు గడ్డం గోక్కుంటూ.

"సరే, నాకేమో అయిదురోజులపాటు అక్కడ కూచుని టెస్టు ఆడేంత తీరికలేదు కదా. అంచేత కలకత్తాకు ఆదివారం పొద్దున విమానమ్మీద వెళ్ళిపోయి 'ఇలా బాటింగ్, ఇలా ఇలా బౌలింగ్, ఇదిరా అబ్బాయిలూ పైనం' అని చెప్పేసి ఆ సాయంకాలానికల్లా తిరిగొచ్చేశాను. వస్తూంటే ఆ విమానంకాస్తా పేలింది. తక్షణం కూలింది. అప్పుడో రెండు నిప్పురవ్వలు కళ్ళలో పడ్డాయి- అదీకథ... నా కళ్ళకేంగాని, పడ్డ శ్రమకు ఫలితంగా మనవాళ్ళు ఆఖరి రెండు టెస్టులూ గెలిచారు... అదిచాలు."

"చ్చొ చ్చొ చ్చొ చ్చొ!" అని ఒక్క నిముషం ఆగి మొదలుపెట్టాడు కోనేటిరావు.

" విమాన ప్రయాణం అంటే - గుర్తుకొస్తుంది డాగ్ హామర్‌స్క్ జోయెల్డు అని ఓ ఆయన వుండేవాడు స్వీడన్ అని అగ్గిపుల్లలదేశంవుంది చూశావూ-ఆదేశంవాడు సుమా! ఆయనేమో- మనకి పంచాయతీ సమితిలాగా అమెరికాలో ఐక్యరాజ్యం అని ఓ సమితివుంది-దానికి కార్యదర్శిగా వుండేవాడు..." మాంచి హుషారుగా చెప్పుకు పోతున్నాడు కోనేటి.

శేషగిరి ఆరు అరవై రెండ్లు ఎంతో గణించ సాగాడు.

లోపల ఎక్కడో పెద్దపళ్ళెం. దాని వెంటనే రెండో ఏడో గరిటెలు పడ్డట్టున్నాయి.

"ఏం... ఆ తర్వాత .. ఆయన పెళ్ళామూ పిల్లలూ భోరుమని ఏడుస్తున్న ఫొటో పత్రికల్లో వేశారు- దాన్ని చూస్తుంటే గుండె ముక్కలయి పోతుందనుకో. ఆ వీర నారికి నేనూ ఒకకార్డు రాశాను; నా సానుభూతి తెలుపుకున్నాను-" అని కళ్ళు తుడుచుకున్నాడు శేషగిరి.

గడియారం పదకొండు కొట్టింది.

"మూడువందలా డెబ్భైరెండు!" అన్నాడు శేషగిరి.

ఏమి టిలా సందర్భం లేకుండా పేలుతున్నాడే అని అదిరి పడ్డాడు కోనేటి. సందేహంగా చూశాడు మిత్రునివైపు. "ఏరా... జ్వరంగాని వచ్చిందా?" అని అడిగాడు.

బోలెడు నిస్పృహతో సమాధానం ఇచ్చాడు శేషగిరి- "హుం!... జ్వరానికేవిటి. ఇలా వచ్చేస్తుంది ఇలా వెళిపోతుంది; హుం!"

కోనేటిరావు సలహా ఇచ్చాడు-"శేషగిరీ! ఇట్లాంటి జ్వరాల కేమీ లేమ. ఒక కప్పు మంచి కాఫీ గనక సేవించితివా క్షణములో పోవును-"

శేషగిరి పలకలేదు.

"అందులోనూ, మీ ఆవిడ అలనాడు మనిద్దరికీ ఇచ్చింది చూశావూ-అచ్చం అమృతంలాంటి కాఫీ-ఆలాటి దయితే వచ్చిన జ్వరాలేకాక, రానివికూడా పోవును; పారి-పోవును." అన్నాడు కోనేటిరావు 'కాఫీ' అన్న రెండక్షరాలు నాలుకకు తగిలితే రెచ్చి పోతున్న ఉత్సాహంతో.

"ప్చ... మేం కాఫీ తాగడం మానేశాము-" అన్నాడు శేష గిరి.

"ఆ అదీ! అందువల్లే ఈ జ్వరాలూ అవీ ఇలా వచ్చే స్తాయి-గనక వెధవది అందునిమిత్తం నెలకో పది రూకలు పోతేనేం గాక మళ్ళీ కాఫీ మొదలెట్టేయి-"

"లాభంలేదు-కాశీలో వదిలేశాం-"

"మరయితే మిత్రులూ బంధువులూవస్తే?" అని క్రాస్ ఎగ్జామి నేషన్ మొదలెట్టాడు కోనేటిరావు, వెళ్ళి కుర్చీలో కూర్చుంటూ.

"ఎండాకాలమయితే తరవాణీ, చలికాలమయితే ఇన్ని మిరి యాలు కొట్టివేసిన పాలూ ఇస్తున్నాం."

"అబ్బా!" అని చేమగా గుటకలు మింగిన కోనేటిరావుకు మిరియాల ఘాటుతో బుర్ర తిరిగినంతపనయింది.

పదకొండున్నర దాటింది. శేషగిరి చేతిమీద చెక్కిలి ఆనించి కూర్చునివున్నాడు.

కోనేటిరావ్ అన్నాడు-"ఒరేయ్ శేషగిరీ! నువ్వు చెడిపోతావు అనుకున్నాగాని మరీ ఇంతగా పోతావని అనుకోలేదురా అబ్బాయ్! ప్చ్!" అని లేచాడు కోనేటిరావు. గుమ్మంవైపు చూశాడు.

"హమ్మయ్య!" అంది శేషగిరి మనసు.

గుమ్మందాకా నడిచాడు మిత్రుడితో-

కోనేటిరావు వీధిలోకి అడుగుపెట్టాడు. శేషగిరి తలుపులు వేసెయ్యబోతుంటే వాటి సందులోంచి కోనేటి నోరుమాత్రంకనిపించి అడిగింది-"అయితే, శేషగిరీ! కాశీలో టీ కూడా మానేశావేమిటి?"

"ఆహా!" అని, ధామ్మని తలుపులు నిర్దాక్షిణ్యంగా మూసేశాడు శేషగిరి.

చరచరా లోపలికి వచ్చేసి, మఫ్లర్‌ని విప్పేసి, దవడలు అద్దంలో చూసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయాడు శేషగిరి. సరోజ అక్కడలేదు!!

అర్థంకాలేదు!

ఓ నిముషం తర్వాత అర్థమయింది. ఇందాకటినుంచి తాను వినిపించుకోలేదుగాని ప్రక్క వాటాలోనుండి ప్రసారం అవుతూన్న రెండు ఆడగొంతుకల్లోనూ ఒక్కటి తన అర్ధాంగిదని గుర్తించాడు శేషగిరి.

ఓ పది నిముషాలు ఊరుకున్నాడు.

అగ్నిప్రమాదంలా బయలుదేరింది ఆకలి. ఓ గ్లాసెడు మంచి నీళ్ళు తాగాడు. తువ్వాలుని చన్నీటిలో తడిపి దవడలకు కాపడం పెట్టుకున్నాడు.

పన్నెండు కొట్టింది.

సరోజ రాలేదు. ఇహ వుండబట్టలేకపోయాడు.

"సరోజా!" అని పిలిచాడు. ప్రక్కవాటాలో ప్రసారం హఠాత్తుగా ఆగిపోయింది.

సరీగ్గా ముప్పైరెండో సెకండు-"ఏవిటి మేష్టారూ! మీకూ మీ మిత్రోత్తముడికీ కాఫీయేనా? కుంపటి ఆర్పేశాను. పాలు తోడి పెట్టేశాను. పంచదార కొద్దిగానేవుంది-" అంటూ ప్రత్యక్షమయింది సరోజ.

ఓ నిముషం ఆమెను పరకాయించి చూశాడు శేషగిరి-"ఏయ్ ఇల్లాలూ! భారతీయ సంస్కృతికీ, నాకూ నీ ధోరణి బొత్తిగా నచ్చ డంలేదు." అన్నాడు.

రెండు చేతుల్నీ వెనక్కి కట్టుకుని గోడకానుకుని నిలబడింది ఇల్లాలు.

"ఓ ప్రక్కన మొగుడనబడువాడు ఆకలితో అలమటించి పోతుంటే నువ్వవతలకి వెళ్ళి తీరికగా కూర్చుని సుబ్బాయమ్మ చంద్రహారంలో నకిలీబంగార మెంతో అంచనా వేస్తూ కూచుంటావా? ఎంత స్నేహితురాలయినా, ఎంత చంద్రహారమయినా భర్త తర్వాతే కదా-"

"ఆవిధంగా వాగ్ధోరణిలో పడితే ఇక అంతుండదేవిటి? ఇవన్నీ నువ్వు నేర్చుకునే దెప్పుడు? నువ్వు ఆదర్శ మహిళవయి వాళ్లా వాళ్లా ఉత్తరాలు రాయనవసరం లేకుండా వుండేదెప్పుడు? ..

నువ్వు మానసికంగా పెరిగేదెప్పుడు?... ఆ...ఆ?'' ఈ మాత్రం వాక్యబాణాలు విసిరేసిన శేషగిరి శోషవచ్చినట్లయింది.

నింపాదిగా ఆ బాణాలను వెనక్కు పంపసాగింది సహధర్మ చారిణి. ''అయ్యా! భర్తగారూ! తొమ్మిది గంటలనుండి పదకొండింటి దాకా తమరు చేసిన పనేమిటి?-'ఒరులేయవి యొనరించిన నర వర అప్రియము తన మనంబునకగు దా నొరులకు నవి సేయకునికి'- పద్యం తాము నేర్చుకునే దెప్పుడు? .. ఆదేశాలకు ముందు ఆచరణ వుండాలని గ్రహించే దెప్పుడు? అన్నిటికన్న మిన్నగా, చల్లనియింటి ఇల్లాలి ఎదుట చలవ కళ్ళజోడు తీసేసి మాట్లాడాలని తెలుసుకునే దెప్పుడు?-''

ప్రవాహానికి అడ్డుపడ్డాడు శేషగిరి, ''ఏడిశావు!'' అన్నాడు.

''తమరూ అదే చేశారు! పదండి తిండికి!'' అంది సరోజ.

ఆ క్షణాన్నే అరమైలు దూరానవున్న అయ్యరు హోటలులో కూచుని, శేషగిరి ప్రాణానికి ఉసూరుమంటూ బేడా అర్ధణా ఇచ్చి కాఫీ తాగుతున్నాడు కోనేటిరావు.